# పైసా కోసం



ఉదయం పదిగంటల వేళ! వచ్చేపోయేకార్లతో— రిక్షాలతో, హడావుడిగా సాగిపోయే మనుషులతో బజారురోడ్డంతా విపరీతమైన సందడిగా ఉంది!

ప్రసాద్ తన మందులషాపులో కూర్చుని — కొత్తగా వచ్చిన మందుల ప్యాకెట్ ఊడదీసి మందు సీసాలు లెక్క చూస్తున్నాడు!

ఇంతలో—

కీచుమన్న చప్పుడు — ఆ వెంటనే కెవ్వుమన్న కేక ఒకదానివెంట ఒకటి వినిపించగా రోడ్డువైపు చూశాడు!

రోడ్డుమీద ఒక కారు ఆగివుంది దాని చుట్టూ జనం.

ఏం జరిగిందో తెలుసుకోవాలనే కుతూహలం కలిగింది ప్రసాద్‌కి.

చేతిలోని మందుల ప్యాకెట్ షాపులోని కుర్రాడికి అప్పచెప్పి రోడ్డుమీదికొచ్చాడు.

ఖరీదైన ఎర్రటికారు ఎండలో మిలమిలా మెరిసిపోతోంది. కారులో అంతకన్నా ఖరీదైన మనుషులు.

ఈ పాడు గొడవేమిటో? అవతల బోల్డు పనులున్నాయి టైమయి పోతోంది. అనుకుంటూ చిరాకుపడుతున్నారు.

ఆ ఎర్రటికారు కింద ఎర్రటిరక్తంలో పదేళ్ళ కుర్రాడు! వాడి శరీరంపై గోచీ తప్ప ఇంకేమీ లేదు. వాడి ఒంట్లో ఎముకలు తప్ప మాంసం లేదు. వాడి ప్రాణాలు అనంతవాయువుల్లో కలిసి అయిదు నిమిషాలైంది.

ఆ దృశ్యాన్ని చూసి చుట్టూ ఉన్న జనం రకరకాలుగా వ్యాఖ్యానిస్తున్నారు!

కొంతమంది డ్రైవర్ని నిందిస్తున్నారు!

కొంతమంది ఆ కుర్రాడిదే తప్పంటున్నారు!

"డ్రైవర్ కారు స్టార్టు చేయబోయాడు.

రోడ్డుమీది జనంలో ఒక్కసారి చైతన్యం వచ్చింది.

డ్రైవరుని అడ్డగించారు.

"నీ కారుకింద పడి నిండుప్రాణం హరీమంటే! చేతులు దులుపుకుని ఎలా పోతావయ్యా ఇదేవన్నా చీమా— దోమా అనుకున్నావా! మనిషి... ఖూనీ చేసి ఎలా తప్పించుకుంటావ్!"

జనం ఆవేశపడిపోయారు.

డ్రైవర్ నిస్సహాయంగా ఉండిపోయాడు.

ఎవరో చెప్పగా పోలీసు కానిస్టేబుల్ వచ్చాడు.

ఏదో రాసుకున్నాడు.

'ఇక పోవయ్యా' డ్రైవరుతో అని.

"ఇక ఉంటా సార్" కారులోని వ్యక్తులకు సెల్యూట్ చేశాడు.

కానిస్టేబుల్ పద్ధతి అక్కడి జనానికి నచ్చలేదు.

"ఏదో కుట్ర జరిగిపోతోంది" అని అనుకున్నారు.

కానీ పోలీసు ఎదుట నోరుమెదపలేకపోయారు.

కారు బయలుదేరబోతోంది.

ఇంతలో—

పెద్ద ఏడ్పు వినిపించింది!

అందరి దృష్టీ అటువేపు తిరిగింది!

ఒక స్త్రీ కొద్దిగా మాసిన చీరతో... విడిపోయిన జుట్టుతో పెద్దగా ఏడుస్తూ పరుగెట్టుకు వచ్చింది.



విన్నకోట సుశీలాదేవి

కారు క్రిందపడ్డ ఆ కుర్రాడిపై పడి రొమ్ములు బాదుకుంటూ ఏడవసాగింది!

"అయ్యో! నా కొడుకా! నీకప్పుడే నూరేళ్ళు నిండిపోయాయా! నిన్ను చంపడానికి ఏ ఎదవకి చేతులొచ్చాయిరా! ఇక నేనేమి చూసుకుబతికేది! నీ మీదే ఆశెట్టుకున్నానే! నేనూ చచ్చిపోతారా. కొడుకా!" అంటూ ఏడుస్తోంది!

ఆమె ఏడుపు అక్కడున్న అందరి హృదయాలను ద్రవింపచేస్తోంది. ఆమె బాధ చూసి ప్రసాద్ కూడా చలించి పోయాడు. ఆ కారులో ఉన్నవాళ్ళను బయటకు లాగి చితకతన్నాలనిపించింది.

కారులో వ్యక్తులు, డ్రైవరుతో ఏదో మాట్లాడారు.

డ్రైవరు కారు దిగి ఆమె దగ్గరకొచ్చి ఆమె చేతిలో అయిదువందలుంచాడు!

"ఆ కుర్రాడు కారు కడ్డుగా వచ్చాడు. అప్పటికీ సడెన్‌బ్రేక్ వేశాను! కానీ లాభం లేకపోయింది." అని కారులో కూర్చున్నాడు.

ఆ డబ్బుని చూసి కొద్దిగా ఏడుపు తగ్గించింది!

"మనిషి ప్రాణం విలువ అయిదొందలా!"

అనుకున్నాడు ప్రసాద్

"ఇక మీరు వెళ్ళండి సార్," కానిస్టేబుల్ చెప్పాడు!

వెంటనే డ్రైవర్ కారుని స్టార్ట్ చేసి... ప్రక్క సందులోంచి పోనిచ్చాడు.

కేవలం అయిదొందల్తో అన్నీ తుడిచివేసుకుని వెళ్ళిపోవడం అక్కడి జనానికి నచ్చలేదు.

"అదేమిటండీ, కానిస్టేబుల్ గారూ! వాళ్ళని అలా వదిలేశారే" ఎవరో అడిగారు.

"ఎక్కడికి పోతారండీ! పేరు రాసుకున్నాగా" అన్నాడు పోలీసు.

ప్రసాద్‌కి ఎందుకో ఆ సమాధానం రుచించలేదు!

## పొరపాటు చిన్నదే!

"ఒకే ఒక్క చిన్న పొరపాటు వల్ల నాకు కోటి రూపాయల నష్టం వచ్చింది తెలుసా?" స్నేహితుడితో చెప్పాడు కామేశం.

"అసలు నీకు ఆస్తే లేదుగా. అంత నష్టం ఎలా వస్తుందీ" ఆరా తీశాడా స్నేహితుడు.

"ఇప్పుడు కోటి రూపాయలు బహుమతి వచ్చిన లాటరీ టికెట్టు పదిరూపాయలు పెట్టి నేనే కొనివుంటే అది నాదే కదూ."

— వాయిల రమణమూర్తి, పార్వతీపురం.

ఒక కుర్రాడిని పట్టపగలు నడిరోడ్డుమీద చంపిన వ్యక్తి ఎంత గొప్పవాడైనా కావచ్చు వాడు హంతకుడే! వాడిని అలా వదిలెయ్యడమా!

"నా తండ్రీ ఇక నేను బతకలేనురా" ఏడుస్తూ ఆమె ఆ కుర్రాడి ఒడిలోకి తీసుకుంది.

అక్కడున్న అందరూ ఎవరికి తోచింది వారిచ్చారు.

ఆమె కొడుకుని బుజం మీద వేసుకుంది!

"అదేమిటి! ఆ కుర్రాడినలా తీసుకుపోతావే! హాస్పిటల్‌కి తీసుకెళ్ళి పోస్టుమార్టమ్ చేయించరా" ఆశ్చర్యంగా అన్నాడు ప్రసాద్

ఆ మాటలే కానిస్టేబుల్ ఆ స్త్రీ దగ్గరికి వెళ్ళి—

"ఏయ్! శవాన్ని దింపు ఇప్పుడప్పుడే తీసుకెళ్ళడానికి వీల్లేదు" అన్నాడు దబాయింపుగా

ఆమె ఇంకా ఏడుపు ఎక్కువచేసింది.

"బాబూ! జరిగిందేదో జరిగిపోయింది! నాకీ కేసులూ వద్దు... పోలీస్టేషన్ల చుట్టూ తిరగలేనయ్యా! నా కొడుకు నివ్వండి! బాబూ! ! ఈ చేతుల్తో పెంచాను. ఈ చేతుల్తో బుగ్గి చెయ్యనివ్వండయ్యా"! అంటూ బతిమిలాడింది

"సరే! పో" అన్నాడు కానిస్టేబుల్

ఆ స్త్రీ ఆ కుర్రాడిని బుజం మీద వేసుకుని వెళ్ళిపోయింది.

కానిస్టేబులూ ఆమె వెనుకే వెళ్ళాడు!

ప్రసాద్‌కి కొంత అసంతృప్తిగా ఉన్నా, ఆ స్త్రీ చెప్పిన మాటల్ని బట్టి ఆలోచిస్తోంటే... జరిగింది బాగానే ఉన్నట్లనిపించింది! ఆమె చెప్పినట్లు కేసులూ, కోర్టులూ అంటే సామాన్య జనం మరింత బాధపడిపోతారు! న్యాయం సంగతి దేవుడెరుగు— ఈ లోపు బతికున్నవాళ్ళు జీవచ్ఛవాల్లా తయారవుతారు. ఆమె తన కొడుకుని తీసుకెళ్ళిపోవడమే మంచిది... అనుకుంటూ షాపులోకి వచ్చి పని చూసుకుంటున్నాడు.

ఒక అరగంట గడిచిందో లేదో రోడ్డు మీద నుండి పెద్ద ఏడుపు విన్పించింది.

ఎవరో స్త్రీ గుండెలు బాదుకుంటూ ఏడుస్తోంది!

రోడ్డుమీది జనం పట్టించుకోవడంలేదు!

ప్రసాద్ లేచి ఆమె దగ్గరకెళ్ళాడు.

" ఎందుకమ్మా ఏడుస్తున్నావ్! ఏం జరిగింది?" అని అడిగాడు.

"బాబూ నా కొడుకు కారు క్రింద పడి చచ్చిపోయాట్ట. ఇక్కడే, ఇక్కడే జరిగిందంట. బాబూ ఆ ఘోరం ఏడిబాబూ! నా కొడుకు ఏవయ్యాడు" దీనంగా అడుగుతోంది!

ప్రసాద్ తెల్లబోయాడు!

"ఆ కుర్రాడు నీ కొడుకా!"

"అవును బాబూ! ఏడీ," ఆత్రంగా అడిగింది.

"ఎవరో ఆమె... తన కొడుకని పట్టుకెళ్ళిందే!"

అంతే... ఆమె క్రింద కూలబడి ఏడవసాగింది! ప్రసాద్ ఆమె వేపు చూశాడు బిక్కచి



క్కిన శరీరం— చీలికలై వేలాడుతున్న చీర... చింపిరి తలలో పెట్టుకున్న పిచ్చిపువ్వులా ఉందామె!

''నా కూతురూ, కొడుకూ అడుక్కోడానికి వచ్చారు బాబూ, ఆడు రోడ్డు దాటబోయి కారు క్రింద పడ్డాట్ట. నా కూతురొచ్చి చెప్పింది. వెంటనే పరుగు పెట్టుకొచ్చా. బాబూ! అదెవతో, నా కొడుకుని పట్టుకెడుతూంటే మీరెలా ఊరుకున్నారయ్యా'' ఏడుస్తోంది.

ప్రసాద్‌కంతా అయోమయంగా ఉంది.

ఒక పిల్లాడికి ఇద్దరు తల్లులా! ఇందులో అసలు తల్లెవరు! పెద్ద మిస్టరీలా తోచింది!

''చూడమ్మా! ఇక్కడ కూర్చుని ఏడిస్తే లాభంలేదు. అతడు నిజంగా నీ కొడుకైతే పోలీసులతో చెప్పు వెళ్ళు!''

''పోలీసులు నా మాట వింటారా బాబూ''

''ఎందుకు వినరు! వెళ్ళి చెప్పు''

సలహా ఇచ్చి తన షాపుకొచ్చేశాడు! ఆ స్త్రీ కాస్సేపు ఏడ్చి... అక్కడి నుండి లేచి మెల్లగా కదిలింది! ప్రసాద్ చాలాసేపటి వరకూ ఆ సంఘటన గురించే ఆలోచిస్తూ ఉండిపోయాడు!

::: ::: :::

సాయంత్రం అయిదయింది!

ప్రసాద్ మెయిన్‌బజారుకెళ్ళి తన పని చూసుకుని బస్సుకోసం స్టాప్‌లోకి వస్తున్నాడు.

ఇంతలో రోడ్డు ప్రక్కనుంచి—

బాబూ! అనాథ ప్రేతశవం.. బాబూ! దహనానికి డబ్బుల్లేవు! బాబూ ఒక్క పైసా ధర్మం చెయ్యండయ్యా! అన్న అరుపులు వినిపించాయి.

ఆ గొంతు ఎక్కడో విన్నట్లుగా అన్పించింది ప్రసాద్‌కి.

ప్రసాద్ ప్రక్కకు తిరిగి చూశాడు.

బస్టాపు ప్రక్కనే కూర్చుని ఉన్నారొక స్త్రీ పురుషుల జంట.

ఇద్దరూ దీనంగా అడుక్కుంటున్నారు. వారి ముందొక శవం...

ప్రసాద్ పావలా తీసి వేశాడు.

బస్సుస్టాపులో విలబడ్డాడు. మళ్ళీ ఆ స్త్రీ గొంతు విన్పించింది! ప్రక్కకు తిరిగి ఆమెవేపు చూశాడు! గుర్తు రాలేదు.

## లావు—బరువు

సముద్రపొద్దున బికినీలు ధరించిన అమ్మాయిలు వ్యాయామం చేస్తుంటే, ఓ లావుపాటి పెద్దమనిషి ఆత్రంగా చూస్తున్నాడు. ఇంతలో మరో పెద్దమనిషి వచ్చి—

''ఆ అమ్మాయిలు చేసే వ్యాయామం వలన లావూ, బరువూ తగ్గటం జరుగుతుందంటారా?'' అనడిగాడు.

''తప్పకుండా! నేనైతే ఆరుమైళ్ళు నడిచి మరీ వస్తున్నాను. వీళ్ళ వ్యాయామం చూడటానికి'' చెప్పాడా పెద్దమనిషి''

హిమజారమణ

మగమనిషి... ''ఒక పావలా ఇవ్వే, టీ తాగుతా, అరిచీ అరిచీ గొంతు ఆర్చుకుపోతోంది'' అన్నాడు.

''చాల్లే! ఎన్నిసార్లు టీ తాగుతావ్! ఇప్పటికే ఈ డబ్బుల్లో చాలా బొక్కపడిపోయింది. ఆ పోలీసెధవకీ... ఆ గంగులుగాడు... ఇద్దరూ చెరో పాతికా గుంజుకుపోయారు...''

''తీసుకుంటే తీసుకున్నారులేవే! బంగారంలాంటి కుర్రాడినిచ్చారు... ఇవ్వాళంతా మనకు పండగే...''

''అదీ నిజమేలే. ఇంతకీ ఆ కారాయన ఇచ్చిన అయిదొందలూ జాగ్రత్తగా దాచావా''! అంటోంది ఆమె...

''ఆ దాచాలేవే...''

ప్రసాద్‌కి చటుక్కున గుర్తొచ్చింది.

ఆమె... ప్రొద్దున కారు క్రిందపడ్డ కుర్రాడిని తన కొడుకని చెప్పి పట్టుకుపోయింది. అయితే అతడు ఈమె కొడుకు కాడా! డబ్బు కోసం అందరూ ఆడిన నాటకమా?''...

గాలికి వాళ్ళముందున్న శవంపై గుడ్డ తొలగింది.

ప్రసాద్ చూశాడు ఆ కుర్రాడే... సందేహం లేదు.

అతని తల తిరిగినట్లయింది.

ఎంత ఘోరం... మనుషుల్లో ఇటువంటి దుర్మార్గులు కూడా ఉంటారా! బతికున్న మనుషుల రక్తమాంసాలతో వ్యాపారం చెయ్యడమే కాదు... శవాల్తో కూడా వ్యాపారం చేస్తారా!

అతని కళ్ళముందు... ఆ రెండో స్త్రీ కదలాడింది.

ఆమే ఇతని కన్నతల్లి. కొడుకు కోసం ఎంత బాధపడింది ఆ కన్నతల్లి పడిన క్షోభ... ఊహకందనిది.

కానీ ఆమె గురించి ఎవరిక్కావాలి.

అందరికీ కావలసింది డబ్బు...

ఆ డబ్బు ఎంత పనయినా చేయిస్తుంది.

మానవత్వపు విలువల్ని కూడా హరించివేసి— మనుషుల్ని దానవులుగా మారుస్తున్న ఓ ధనమా! నీకు జోహార్లు...

ఆవేదనగా అనుకున్నాడు ప్రసాద్!

